# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-06-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. అమరావతి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం కొనసాగుతోంది.**

**2. యోగాంధ్రలో రెండు గిన్నిస్ బుక్, 21 వరల్డ్ బుక్ రికార్డులు సాధించడంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి హర్షం వ్యక్తంచేశారు.**

**3. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి 40 ఆలయాల్లో పాలకమండళ్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.**

**4. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడాది కాలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.**

**5. ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.**

==========================

అమరావతి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం కొనసాగుతోంది. పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. 31 అంశాలతో నేటి మంత్రి వర్గ సమావేశం కొనసాగుతోంది. ముఖ్యంగా విశాఖపట్నంలో కాగ్నిజెంట్ సంస్థ ఏర్పాటుకు భూమి కేటాయింపులపై సమావేశంలో చర్చించనున్నారు. అలాగే రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ– సీఆర్డీఏ ప్రతిపాదనలకు కూడా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అమరావతిలో రెండో దశలో 44వేల ఎకరాల భూమి సేకరణ అంశం మంత్రి వర్గం చర్చించనుంది. వీటితో పాటు పలు కీలక అంశాలపై రాష్ట్ర మంత్రి వర్గం చర్చించి ఆమోదం తెలపనుంది.

--------------------------

విశాఖపట్నంలో ఈ నెల 21న నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అవార్డులు సాధించిన కీలక శాఖల ఉన్నతాధికారులను, ఉద్యోగులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అభినందించారు. అమరావతిలో నిన్న నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో గిన్నిస్ రికార్డులను మంత్రులు, అధికారులకు అందజేశారు. యోగాంధ్రలో రెండు గిన్నిస్ బుక్, 21 వరల్డ్ బుక్ రికార్డులు సాధించడంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి హర్షం వ్యక్తంచేశారు.

--------------------------

సంవిధాన్ హత్య దివస్ రేపు జరుపుకుంటారు. జూన్ 25, 1975న భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసిన సంఘటనలను దేశం గుర్తుచేసుకుంటుంది. అత్యవసర పరిస్థితి కారణంగా నష్టపోయిన వారందరికీ నివాళులు అర్పిస్తారు. దీనిపై మరిన్ని వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

వాయిస్... 33 సెకన్లు

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి 40 ఆలయాల్లో పాలకమండళ్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. 2047 విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా విజయవాడ ఇంద్రకీలాద్రిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. రానున్న50 ఏళ్లలో భక్తుల రాకను అంచనా వేసుకుని, ఇంద్రకీలాద్రి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు మంత్రి వివరిస్తూ..

వాయిస్.. 28 సెకన్లు

---------------------------

కేంద్రప్రభుత్వ పథకాలు నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం ద్వారా తిరుపతి జిల్లాలో ఎంతోమంది లబ్ధి పొందుతున్నారు. దేశంలోని చిన్న ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని తిరుపతి జిల్లా వాసులు సద్వినియోగం చేసుకుంటున్నారు. శ్రీకాళహస్తికి చెందిన లబ్ధిదారు గోమతి ఈ పథకం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఎంతగానో దోహదపడిందని కేంద్రప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

...వాయిస్: 29 సెకన్లు

---------------------------

వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్య సాధనలో సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమలు కీలకపాత్ర పోషించనున్నాయని 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ స్పష్టం చేశారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయుల సమావేశం నిన్న నిర్వహించారు. ఏడాది కాలంలో రాష్ట్రానికి 9లక్షల 30 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఐదేళ్లలో 20 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

---------------------------

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడాది కాలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు... పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని రైల్వేస్టేషన్‌లు ఆధునీకరించటంతో పాటు.. రహదారులు అభివృద్ధి చేశామన్నారు. ఏడాది కాలంలో విజయవాడలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పుస్తకాన్ని కేశినేని శివనాథ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొండ ప్రాంతాల్లో నీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన చెబుతూ..

..వాయిస్...36 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను మాదక ద్రవ్య రాష్ట్రంగా తీర్చిదిద్దేలా పనిచేస్తున్నామని ఈగల్ టీం ఐజీ రవికృష్ణ తెలిపారు. విజయవాడలోని వైద్య కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ పాత్రికేయులతో మాట్లాడుతూ... గంజాయి అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు చేపట్టామని తెలిపారు. పోలీసులు, ఈగల్ బృందం సంయుక్తంగా దాడులు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. 24 గంటలూ పనిచేసే సెంట్రల్ కంట్రోల్ రూమ్ కూడా ఈగల్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేశామని ఆయన వివరిస్తూ....

..వాయిస్ .. 27 సెకన్లు

---------------------------

నైరుతి రుతుపవనాలు మరో రెండు, మూడు రోజుల్లో దేశమంతా వ్యాపిస్తాయని భారత వాతావరణశాఖ అంచనా వేస్తోంది. పశ్చిమమధ్య, సరిహద్దు వాయవ్య బంగాళాఖాతం సహా ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. శుక్రవారం ఉత్తరకోస్తాలో భారీ వర్షాలుంటాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో మంగళవారం మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

---------------------------

ప్రముఖ తెలుగు రచయిత పాలగుమ్మి పద్మరాజు జయంతి ఈరోజు, తన జీవిత కాలమంతా రచనలతోనే జీవనం సాగించిన ఆయన... 1915 జూన్ 24వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం తిరుపతిపురంలో జన్మించారు.

=====================